# నిష్కామ కర్మ

శ్రీ ఒంగోలు పద్మరాజు

నేను పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుతు న్నాను. నాకోసం స్టేషనుకు వచ్చిన స్నేహి తుడు కొంచెముసేపు నావంక చూసి "ఏమి టిరా ఎందు కట్లా నవ్వుతావు" అన్నాడు. కథ చెపుతాను వినరా అన్నాను.

నీకు తెలుసును కదా—అత్యవసరమయిన పని మీద నేను బయలు దేరాను. ఆఫీసుకు సెలవు ధరఖాస్తు పంపించడానికయినా మనిషి చిక్కలేదు. స్టేషనులో ఎవరయినా తెలిసిన వాళ్లు కనబడక పోతారా అనుకొని రైలుకు బయలు దేరాను. స్టేషను చేరే సరికి యింక రైలు సెంట్రలు వదల డానికి పదిహేను నిమి షాలు మాత్రమే టయిము వుంది. వెంటనే టిక్కట్టు పుచ్చుకొని స్నేహితులు కానీ ముఖ పరిచితులు కానీ ఎవరయినా ఒక్క రయినా కనబడతా రేమో నని అంతటా వెదికాను. విచిత్రం! సెంట్రలు స్టేషనులో ఎప్పుడూ ఎంతో మంది కనుపించే వాళ్లు, ఇవ్వాళ ఒక్క డయినా ఎరిగిన వాడు కనిపించ లేదు. ఇక చేసే దేమిటి? ప్రయాణము మానుకో డానికి వీలు లేదు

ప్లాటు ఫారం మీద ఎవరయినా కనిపించక పోతారా అను కొంటూ వచ్చాను. అక్క డా వెదికాను. ఎవ్వరూ కనిపించ లేదు. సరే, యిక నిరాశ చేసుకొని యింటికి వచ్చి పోష్టులో ఉత్తరము పంపిద్దా మను కొని బండిలో ఎక్కుదామని చూస్తే ఖాళీ కనిపించ లేదు. ఇంజను పక్కన వున్న పెట్టె దగ్గిరకు వచ్చాను. ఇంతలో మిత్రుడు సుధాకర శాస్త్రి బెజవాడ పోవడానికి వచ్చినాడు.

వాణ్ణి చప్పున పోల్చుకొన లేక పోయినాను. తెల్ల రంగు అయినప్పటి కిన్ని మన్మధుడి అవ తారము, అందులో—జయిలులో వుండగా గడ్డము కూడా పెంచి నాడు. బహుశః స్వరాజ్యము వచ్చే వరకున్నూ గడ్డము తీసి వేయడేమో!

వాడి ఖద్దరు సంచులూ—ఆడవాళ్ల మూట లాంటి వాడి మూటా—అన్నీ గబ గబా బండిలో సర్దుకొని ఆంధ్రపత్రిక కొనుక్కొ న్నాడు.

శాస్త్రి చిన్నవాడు అయినప్పటి కిన్ని స్వ రాజ్య సంపాదనా విచార సాగరములో పడి యీదుతున్నందు వల్ల కాబోలు గడ్డములో

అక్కడక్కడ వెండ్రుకలు నెరిసి పోయినవి. కళ్లు పీకు కొని పోయినవి.

ఆంధ్ర పత్రిక మూసివేసి బండి దిగి అటూ ఇటూ ఎందుకో చూస్తున్నాడు. అదివరకు నేను ఆయన్ను ఎన్నడూ చూడలేదు—రామకృష్ణ శాస్త్రి ఆయన పేరట—ఎవరినో ఒక యువతిని వెంట బెట్టుకొని వచ్చినాడు. ఆ యువతీ—ఆమె వెంట వున్న కుర్రవాణ్ణి రైలు ఎక్కించినాడు.


ఆమెను సాగ నంపడాని కోసం కాబోలు కాలేజీలో చదువుకొంటున్న తోటి విద్యార్థినులు కూడా కొంత మంది వచ్చారు. రామకృష్ణ శాస్త్రిని చూడగానే సుధాకరశాస్త్రికి అమిత సంతోషం కలిగింది. ఏదో మాట్లాడుతున్నాడు.

బండి యెక్కిన యువతి క్షణములో అదివరకు కూచున్న స్త్రీలతో పరిచయము కలగజేసు కొని చోటు సంపాదించు కొని కూచుంది. మాటల్లో సుధాకర శాస్త్రి తన స్నేహితుణ్ణి “ఎవరా అమ్మాయి!” అని అడిగి నాడు.

“ఆఁ మన సుబ్బారావు చెల్లెలు. కుర్రాడు సుబ్బారావు కొడుకు. సెలవలకు నెల్లూరు పోతున్నారు. రైలు ఎక్కిద్దామని వచ్చాను” అన్నాడు.

“ఏమిటీ—సుబ్బారావు చెల్లెలా! నన్ను ఆమెకు పరిచయము చేయి. రైలులో విసుగు లేకుండా ఆ అమ్మాయి వెళ్ల వచ్చును. పయిగా ఆమె కేమయినా కావలిస్తే నేను తెచ్చి యిస్తాను”

“అంత కన్నా కావలిసిం దేమున్నదిరా: “బ్రొదర్” అంటూ “కమలా: ఇలా చూడు. ఇతను సుధాకరశాస్త్రి, మీ అన్నయ్యా యితనూ బహుకాలము ఒక గదిలో వుండి చదువు కొన్నారు. మంచి స్నేహితులు. ఏమీ సంకోచ పడకుండా దారిలో ఏమయినా కావలిసి వస్తే వీరిని అడుగు. నీకు తెచ్చి పెడుతారు.”



ఆ యువతి సుధాకర శాస్త్రిని చూస్తూ మందహాసముతో “నమస్కారమండీ” అన్నది.

కాని ఆమె ముఖములో ఏదో ఒకరకమయిన యీసడింపు మాత్రము కాస్త గోచరించింది.

"మీ అన్నయ్యకూ—నాకూ పదేండ్ల పరిచయం. కాని యిదివరలో మిమ్ములను చూడ లేదు" అంటూ శాస్త్రి ఉత్సాహముతో—సంతోషముగా రైలు ఎక్కినాడు.

నేను "ఏమండీ శాస్త్రిగారూ—మీ స్నేహితుల దగ్గిర యివ్వండి. వారు వెళ్ల డానికి వీలు లేక పోతే పోష్టు చేయ మనండి. ఇది సెలవు ధరఖాస్తు" అని తపాలా బిళ్లకని గానీ—ట్రాముకని గానీ డబ్బులు యిచ్చాను. ఆయన పుచ్చుకొన్నాడు.

ఇంతలో రైలు కదిలింది.

కమల స్నేహితు లందరికీ "గుడ్ బై" చెప్పింది. రైలు సాగగానే తన్ను చూస్తూన్న స్నేహితులను చూస్తూ చేయి కిటికీలో నుంచి బయటకు పోనిచ్చి చేరుమాలు విసిరింది. ఆ స్నేహితులున్నూ ఆ విధంగానే చేశారు.

రైలు వేగం హెచ్చింది. ప్లాటు ఫారం దాటింది. కమల ఏదో వెతుకు తున్నట్టు చూస్తున్నది. ఇంతలో శాస్త్రి "అమ్మాయీ ఏక్లాసు చదువు తున్నావు" అన్నాడు.

"ఆనర్సు మూడో సంవత్సరం"

"సబ్జెక్టూ?"

"కెమిస్ట్రీ"

"బాగుంది...మీ అన్నయ్యను చూసి చాలా కాల మయింది. యిప్పుడు యెక్కడ వుంటున్నాడు?"

"నాగ పూరులో ఎలెక్ట్రికల్ యింజనీరుగా వున్నారు"

"మరి యీ కుర్రాడు యిక్కడ వున్నాడేమి?"

అతః పూర్వమే కొంచెము విసుగు సూచిస్తున్న కమల కొంచెము ముఖము చిట్లించుకొంటూ "ఏం వుందండీ వాళ్ల అమ్మ పోయినప్పటి నుంచీ నాతోనే వుంటున్నాడు" అంటూ చటుక్కున హిందూ పత్రిక తీసుకొని చూడ సాగినది. సుధాకరశాస్త్రి ఆంధ్ర పత్రికలో నుంచి ఆమెను చూస్తూ—ఆ పత్రికను అవతల పెట్టి తన ఖద్దరు సంచీతీసి అందులో నుంచి కమలా ఫలాలు తీసి ఓపికగా వొలిచి, వొలిచిన పండు పండూ "అమ్మాయీ పుచ్చుకో" అన్నాడు.

కమలమ్మ వద్దంటే వద్దన్నది. కొన్ని బద్దలు తీసి కుర్రాడి చేతులో శాస్త్రి పెట్టాడు. వాడు సంతోషంగా పుచ్చుకొన్నాడు.

నేను యిదంతా గమనించీ గమనించకుండా వున్నాను. నూట పదిహేను డిగ్రీల ఎండ కాస్తున్నది. వీస్తున్న వేడి గాలి విపరీత మయినది. అయితే రైలు టాంకులో నుంచి నీళ్లు అప్పుడప్పుడు తోణికి గాలి తీవ్రానికి యింజను పక్క బండిలో కూచున్న మా మీద

పడుతూ వుంటే—ఆ యెండా ఆ గాలీ కొంత హాయిగానే వుంది.

పది గంట లయ్యే సరికి రైలు సుళ్లూరు పేట స్టేషన్‌లో ఆగింది. సుధాకరశాస్త్రి హిందూ పత్రిక చూస్తూ వున్న కమలతో—ఉత్సాహముగా "అమ్మాయీ, కాఫీ పుచ్చుకుంటావా" అన్నాడు. ఆమె "అక్కరలేద" న్నది.

పోనీ డ్రింకు అయినా పుచ్చుకొంటుం దేమో ననుకొని తనకూ—కుఱ్ఱవాడికీ—ఆమెకూ అని వుద్దేశించి మా పక్క బండిలో వున్న "స్పెన్సరు" వాడికి మూడు గ్లాసుల డ్రింక్సు అయిసుతో సహా తెమ్మని ఆర్డరిచ్చాడు.

కథంతా తమాషాగా వుంది. నేను ఏమీ గమనించ నట్టుగానే వున్నాను—నా కొక డ్రింకు వస్తుందా రాదా అనుకొంటూ. అయినా చూతామని పడు కొన్నాను. స్పెన్సరు వాడు మూడు గ్లాసుల్లోనూ డ్రింకులు పోసి అందించాడు. రైలు కదిలింది. కుఱ్ఱాడు ఏమీ సంకోచము లేకుండా తీసు కొన్నాడు. బహుశః పుచ్చుకోడానికి యీ కాస్సేపటి లోనే అలవాటయి వుంటాడు.

ఆమె మాత్రము నవ్వుతూ "అక్కరలేద" న్నది. శాస్త్రి కేమీ తోచక—అది అవతల పారబోయ డానికి మనస్కరించక నాతో "మీరు పుచ్చుకోండి సార్" అన్నాడు.

"నాకెందు కండీ—తిన్నగా ఆమెకు యివ్వించండి" అన్నాను—అదివరలో జరుగు తున్న దంతా గమనించని వాడికి మల్లె.

"ఆమె తీసుకోదు—లాభం లేదు" అని విచారముతో శాస్త్రి అన్నాడు.

నేను డ్రింకు తీసుకొని మూడింటికీ డబ్బులు యివ్వబోతే అడ్డపడి నన్ను యివ్వకుండా చేశాడు.

ఇంతకూ కమలకు శాస్త్రి మీద అనుమానమే కలిగిందో అసహ్యమే కలిగిందో చెప్పలేను. కాని తనతో ఆమె ఎట్లా ప్రవర్తిస్తున్నదో అన్న విషయ గమనించాడా లేదా అనేదే సందేహము.

పాపము శాస్త్రి ఏమి పలకరించినా సబబయిన జవాబు యిచ్చేది కాదు. అతను నోరు తెరిస్తే ఆమెకు న్యూసెన్సుగా వున్నట్టు చూసి ఒక్క మాటతో సమాధానము చెప్పి ముఖము ముడుచుకుని కూర్చుం డేది. చదువు కున్న ఆడపిల్ల లంతా ఎంతో చనువుగా ఎవరితోనైనా వుంటారని ప్రతితే—ఇదేమిటా అనుకున్నాను. పయిగా ఒక కుఱ్ఱాణ్ణి మాత్రమే వెంట తీసుకొని ప్రయాణ మయిన కమల అదివరలో రైల్లో ఒంటరిగా ప్రయాణము చేయడానికి అలవాటు పడి వుండవలెను. లేకపోతే బయలు దేరుతుందా?

కాలేజిలో చదువు కొంటూ, మంచి వయస్సులో వున్నది—ఆమె రైలులో ప్రయా

ణము ఎప్పు డయినా ఒంటరిగా చేయవలసి వచ్చి నప్పుడు యేమయినా కావలిస్తే తనకు తెలియక పోయి నప్పటికిన్నీ సంకోచము లేకుండా ఎవరి నయినా తప్పకుండా అడుగు తుంది. అప్పుడు వాళ్లున్నూ—అంటే యువతీ సహాయార్థము బయలు దేరిన వాళ్లున్నూ "షివల్‌రసు"గా పోయి ఒకటి అడిగితే రెండుగా కేవల పారమార్థిక చింతతో తెచ్చి యిస్తారు.

ఎందు చేతనో శాస్త్రి కూడా డ్రింకు ఆమె ఎట్లాగయినా పుచ్చుకునేట్టు చేయవలె నని గట్టి ప్రయత్నము చేశాడని అనుకోను. బాగా ప్రాథేయ పడినట్టయితే ఆమే పుచ్చు కొనే వుంటుందని నావూహా. "When a maiden says no she means yes" అనే సమాచారము శాస్త్రికి తెలుసునో తెలియదో. తెప్పించిన డ్రింకును ఎట్లాగయినా ఆమె చేత తాగించవలె ననుకుంటే అది ఆమె విషయములో అంత దుస్సాధ్యమూ అని పించింది నాకు మాత్రము.

ఇంతకూ యీకాలపు చదువు కున్న ఆడ వాళ్లను శాస్త్రి ఎరుగునో ఎరగడో! అంతే కాకుండా శాస్త్రి వైఖరి చూసే టప్పటికి అంత ఫాషనబుల్‌గా వున్న ఆ కమలకు—ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో మైళ్ల తరబడి ఎండ అనక—వాన అనక నడిచి ప్రచారం చేసి చేసి వచ్చి ముఖమంతా జిడ్డు కారుతూ ఉండే కాంగ్రెసువలంటీరు రూపం జ్ఞాపకానికి వచ్చి వుండ వలెను.

నిజంగా కమల చక్కని దనే అనవలెను. సన్నగా పొడుగ్గా చువ్వ లాంటిది. ఏ అవ యవములోనూ లోపము కనుపించదు. మంచి శరీరచ్ఛాయా, శరీరచ్ఛాయకు తగినట్టుగా చాకలెట్టు రంగుపట్టు చీరె—ఆ పట్టు చీరెను గుజరాతీ—ఆంధ్ర కట్టులను మిళితం చేసి కట్టిన కట్టు. పక్క పాపిట, చెవులకు పెట్టు కున్న లోలక్కులు మాత్రమే కనుపించే టట్టు చెవుల మీదికి దువ్వుకుని పొడుగ్గా వ్రేలాడ వేసుకొన్న జడ—యిట్లాంటి రూపము ఎవరి నయినా ఆకర్షిస్తుంది. పయిగా ఆ మొఖము చూస్తే ఎవరి కయినా మాట్లాడ వలెననే బుద్ధి పుడుతుంది. కాదు ఆమె మాట్లాడితే సంతోషించ వలెననే బుద్ధి పుడుతుంది.

ఆమెకు శాస్త్రి అంటే చీదర—అది వాడు గమనిస్తేగా—కర్మము. ఏమి చేస్తాము.

క్షణము సేపయిన తర్వాత మళ్లీ ప్రారం భించాడు. "అమ్మాయీ—ఎండగా వుంది లే ఆకిటికీ తలుపు వేస్తాను—కొంచెము జరుగు తావా?"

"వద్దు—ఇట్లా వుంటేనే హాయిగా వుంది"

మళ్లీ కాస్సేపు ఏమీ మాట్లాడ లేదు. అదివరలో పలకరిస్తే ఒక మాటా అర మాటా మాట్లాడు తున్న కమల యింక పలకరిస్తే

అసలే మాట్లాడ నన్నట్టు మొఖము పెట్టు కొని కూర్చున్నది. కాని శాస్త్రి ముఖములో ఉత్సాహము కానీ హుషారు కానీ యీ షణ్మాత్ర మయినా తగ్గి పోలేదు.

ఇంతలోకే రైలుబండి గూడూరు స్టేషన్ లోకి వచ్చింది. "అమ్మాయీ—చాలా పొద్దు అయింది — భోజనం చేయండి— తెస్తాను" అన్నాడు శాస్త్రి.

"అబ్బ: వద్దండీ—మీరు ఎందు కింత శ్రమపడతారు? మేము అక్కడనే భోజనం చేసి వచ్చాం"

"అలా కాదండీ నెల్లూరు వెళ్లేసరికి పన్నెం డున్నర దాటి పోతుంది. ఇంక యింటికి పోయే సరికి ఒంటి గంట అవుతుంది. ఏమున్నా కాస్త పొట్టలో వేసుకుంటే మంచిది ; యీ ఎండలో" అంటూ ప్రత్యుత్తరానికి చెవి యీయ కుండా గబ గబ రైలు దిగి శాస్త్రి వెళ్లి పోయినాడు.

రైలులో కూచుని యీ గొడవ చూస్తున్న ఒకామె "ఎవరమ్మా: ఆయన?" అన్నది.


కమల వికటంగా నవ్వుతూ చేతులు తిప్పుతూ "ఏమోనండీ! నాకు తెలియనే తెలియదు. మా అన్నగారి స్నేహితుడని యిందాక మెవరో చెప్పారు. ఇక్కడ రైల్లో పరిచయమే. ఇది ఎవర కెన్నడూ చూసి యెరగను" అన్నది.

"మిమ్మల్ని యిందాక రైలు యెక్కించ డానికి వచ్చాడే—ఆ దొర వేషంలో వున్నాడే ఆయనేనా మీ యింటి ఆయన...ఏం పని చేస్తున్నారు: ఎంత జీతం?"

కమలకు నవ్వు వచ్చి నవ్వింది. వెంటనే మూతి బిగించుకొని "నా కింకా పెండ్లి కాలేదండీ! మా కుటుంబానికి ఆయన స్నేహితుడు. ఆయన అదేదో పనిలో వున్నాడు లెండి... నేను మద్రాసులో చదువు కుంటూ ఒంటరిగా వుంటున్నాను. కనుక అప్పు డప్పుడు వచ్చి మంచి సెబ్బరలు విచారించి పోతూ వుంటాడు."

"అయితే యీ పిల్లవాడు నీ కొడు కేనా?" కమలకు నవ్వూ కోపమూ రెండూ వచ్చి వూరుకుంది.

నాకూ నవ్వు వచ్చి అక్కడ కూచోడానికి యిష్టము లేక రైలు దిగి కాఫీ తాగి వచ్చి కూచున్నాను. కాస్సేపటికి మన శాస్త్రి తయిరు సాదం—సాంబారు సాదం—పొట్లాలు రెండు తీసుకొని వచ్చి కమలకు ఇవ్వబోయి నాడు.




ఆమె "వద్దు" అరిచి. అంతకు ముందు మాట్లాడి నావిడ "పుచ్చుకో అమ్మా—ఫరవా

లేదు ” అంది. ఎవరేమి చెప్పినా ప్రయోజనం లేక పోయింది. హోటలులో తిన్నాడో లేదో కాని తెచ్చిన రెండు పొట్లాలను మన శాస్త్రి మాయం చేశాడు. మంచినీళ్లు తాగి తన సంచిలో నించి నాలుగు ఆపిలు పండ్లూ నాలుగు సపోటా పండ్లూ మూడు కమలా ఫలాలూ తీసి కమలకు ఇవ్వ బోయినాడు. ఆమె ముఖము అటు తిప్పి మేనల్లుడితో “ ఒరేయ్- వారు పండ్లు యిస్తున్నారు-తీసుకోరా ?” అంది. అయితే ఆమె మాత్రము ఆపండ్లను ముట్టుకో లేదు.

నెల్లూరు సమీపించింది. నేనూ నెల్లూరులో దిగేవాణ్ణే గనుక స్టేషను రాకముందే నా సామానంతా సద్దుకొని రైలు ఆగగానే దిగుదా మను కొన్నాను.

రైలు దిగాను. కాని యింకా యేమి జరుగు తుందో చూదామనే వూహతో అక్కడే తచ్చాడడము మొదలు పెట్టాను. కమల మేనల్లుడితో బండి దిగింది. శాస్త్రి కూడా హడావుడిగా బండి దిగి ఆమె దగ్గిరకు గబు క్కున వచ్చి “ జట్కాబండి కుదిర్చి పెడ తాను. మీ యిల్లెక్కడో చెప్పండి ” అన్నాడు.

ఆమె జవాబయినా చెప్పకుండా నవ్వు ముఖముతో వెంట వున్న కుర్రాణ్ణి చేత్తో లాగుకుంటూ జనములోకి దూసుకుని పోయిం ది. స్టేషను యివతలకు వచ్చేసరికి ఆమె పక పక నవ్వుతూ—ఆపుకో లేకుండా పక పక నవ్వుతూ— అడుగు ముందుకు వేయలేక ఆయాసముతో నిలుచున్నది. ఆమె నయితే శాస్త్రి చూశాడో లేదో కాని జట్కా బండ్ల దగ్గిరకు వెళ్లి బండ్ల వాళ్లతో మాట్లాడు తున్నాడు. కమల చటుక్కున ఆయన్ను చూసింది. వెంటనే సమీపంలో వున్న జట్కా బండి వాడితో ఫలాని చోటకి పోనియ్యమని శాస్త్రి కంట బడకుండా బండి యెక్కింది. బండి సాగింది.



శాస్త్రి బండి మాట్లాడు కొని వచ్చేసరికి కమల ఎక్కడ వుంది ? అక్కడా—ఇక్కడా చూశాడు. కనబడలేదు. త్వర త్వరగా వెయి టింగు రూములోకి వెళ్లాడు. ఇం కెక్కడి కమల—కనిపించనే లేదు.

శాస్త్రుల్లు స్థితి చూస్తే షేక్సుపీరు—కాదు యిబ్సెను ట్రాజడిలోని కడపటి రంగము

జ్ఞాపకం వచ్చింది, కమాండింరుఙ్ఞ — హార్డ్డిపోజు వచ్చింది. నాకో నవ్వు ఆగ లేదు. ఏమి చేసేది ? నవ్వు పట్టలేక పొట్టచెక్క లయ్యేట్టు నవ్వు తున్నాను.........

ఇంక పోదాము అని కథ వింటున్న మిత్రుడితో అన్నాను. వాడున్నూ నవ్వుతూ "నిష్కామ కర్మ అంటే యిదే సుమా" అని మళ్లీ నవ్వాడు.

"కాదు. కాదు. వాడి దగ్గిర గాంధి గారి అనాసక్తి యోగము వుంది. ఇది అనాసక్తి యోగమను కుంటాను" అన్నాను.

---

డొంగ్రేగారి
బాలామృతము
బలహీనులైన
బిడ్డలకు బలపుష్టి నిచ్చును

*MADRAS AGENTS —*

**DAMODER & CO.,**

China Bazaar MADRAS

---

రుచికిని సౌఖ్యమునకును అమోఘమైనది

రుక్మిణి కుక్కర్

వివరముల పుస్తకము
Free

ఈ వంట సెట్టువల్ల, వంట సౌఖ్యంగా, సులభంగా, పొదుపుగా తయారగుటయే గాక భోజనకాలంలో మంచి రుచిని కలిగించి, సత్తువను పెంపొందించును.

1, 2, 4, 6, 8, 12, 16 మంది, జనులకు తగిన 7 సెట్టులు క్రమ వరుసగ రూ. 9, 12, 16 21, 26, 32, 38 రూపాయల ఖరీదు.

నేడే వ్రాయుడు.

ముఖ్య నగరము లందంతటను ఏజెంట్లు కావలెను!

రుక్మిణి కుక్కర్ కంపెని రాయపురమ్ (13) మదరాసు.

---

మీకు కావలసిన చక్కని స్వదేశీ సిల్కు యుడుపులు, గుడ్డలు, పలువిధములైన చీరెలు, జాకెట్టు రకములును,

కేశవరామ్ అండు కంపెని,

1287 ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.